# ఎండిపోయిన కొమ్మ

'నిఖిల్'



జనం వస్తున్నారు- పోతున్నారు. వింతగా చూస్తున్నారు- బాధపడినట్లు కనపడుతున్నారు. గుమిగూడుతున్నారు – చెదరిపోతున్నారు.... ఎంతోమంది....

అందమైన అమ్మాయిలు దూరం నుంచి, ముసలివాళ్లు దగ్గరి నుంచి లోలోపలే సానుభూతి వ్యక్తంచేస్తూ నిట్టూర్పులు విడుస్తూ—వెలుతున్నారు.

కొందరు అలా ఒక చూపు పారేసి అది తమ పాపం కాదనుకొంటూ యాంత్రికంగా నడచిపోతున్నారు.

పైన.... పైసలు పరచుకున్న గోనె పంచికి పైగా వేలాడుతున్న శవం. పది అడుగుల ఎత్తు చెట్టుకొమ్మకు గాలిలో వేలాడుతున్న మనిషి. కాళ్ళు ముడతపడి మెడఒకవైపు వేలాడి-నోట్లోరక్తంకారి- నాలుక రక్తంతో ఎండి, బయటికి వేలాడి గాలిలో ఊగకుండా—వున్న శవం!

ఆపైన పచ్చపచ్చగా ఆకుపచ్చని ఆకులు.... ఇంకా ఎండకు ఎండిపోని ఆకులు.

కుడి - ఎడమల ఇద్దరు పోలీసు జవాన్లు.

ఒక పోలీసు ఎదుట ఇద్దరు ముగ్గురు

మాట్లాడుతూ ఆ శవం వేలాడిన పద్ధతి గురించి తర్కించుకుంటున్నారు.

"ఇంత చిన్న చెట్టుమీదికెళ్ళి కిందికి ఎట్లా వదలతండి? కింద కాళ్లు అనితే గొంతు బిగుసుకపోతదా!" అని ఒక ముసలి మనిషి అనుమానం.

"లేదండీ, ఏముంది తాగిన విషాలో కాళ్ళు ముడుచుకుని పడివుంటాడు." అని మరో మనిషి సమాధానం.

"అది ఎట్లా సాధ్యం? పైకీ కిందికీ శరీరం తిన్నగా వేలాడితేనే కదా చావు సాధ్యం." మరొకరి సంశయం.

"ఇగో అదంతా పాతకాలం మాట, ఇప్పుడు చావుదలచుకున్నాడు గిట్లనే చస్తడు!" అని-సాధికారంగా అందరి తర్కాల్ని ఎగరగొట్టేసాడు పోలీసు.

డబ్బులు పోగుచేస్తూ శవాన్ని ఎట్లా తీసుకెళ్ళాలో పక్కనే వాదించుకుంటున్న ఇద్దరు రైల్వే పోర్టర్లు.

కింద కంకర రాళ్లు గీసుకుంటూ పారలకింద పోరసుకుంటూ చప్పుడు.... గ్యాంగ్ కూలీలు అరుస్తూ కిందికి పట్టాల కిందికి పారలు దించుతున్నారు.

దూరంగా కనబడిన ట్రైన్‌ను చూసి కూలీల కేకలు

రైలు వచ్చి ఆగింది.

లోకల్ ట్రైన్ ప్రయాణికులు ఎవరి మానాన వాళ్లు ..బ్యాగ్లోకి ఆ రైలు పెట్టెల్లోంచి కొందరు ఆశ్చర్యంగా బయటకి చూస్తూ. కొందరు లోపలే వాడు అట్లా ఎట్లా ఉరిపోసుకున్నాడా అని తర్కించుకుంటూ....

రైలు కదిలింది.

విద్యానగర్ స్టేషన్‌ను వదిలిపెడుతోంది.

కొంత జనం తరలింది.

రైల్వే కూలీల గ్యాంగు తిరిగి పట్టాల పైకి విరుచకపడింది

చెట్టుకొమ్మకు వేలాడుతున్న ఆ ఊపిరిలేని వెంకయ్య శరీరం శవంగా మారిపోయి అక్కడే అలాగే వేలాడుతున్నాడు.

వెంకయ్య నిన్నటి సాయంత్రం వరకు స్టేషన్ బయట నిలుచున్న రిక్షావాడు. ఈరోజు ఉదయమంతా కొమ్మకు వేలాడుతున్న కట్టెలాంటి కాయం!

ఎన్నో వేలమంది రిక్షావాళ్ళల్లో ఒకడు వెంకయ్య. రోజూ బుద్ధిగా రిక్షా తొక్కే మనిషి. సాయంత్రం కాగానే ఎక్కడో అక్కడ కాసిన్ని కల్లునీళ్ళు లేదా చిన్న పీసాడు గుడంబా పట్టించే మంచివాడు తన కష్టంతో తానే పొట్ట నింపుకొని కండనాల కష్టాన్ని మరచిపోవాలని తాగేవాడు. మంచిగా సుఖంగా నిద్రపడుతుందని తాగే వెంకయ్య నిన్న రాత్రి అట్లాగే శాశ్వతంగా నిద్రపోయాడు. మత్తులో చచ్చిపోయాడు. రక్తం కక్కుకుని కళ్లుమూసుకొన్నాడు.

అర్ధరాత్రి ప్లాట్‌ఫారమ్ మీది చెట్టు కొమ్మపైకి చేరుకున్నాడు. ఎందుకు చేరు



తున్నాడు? ఎట్లా చేరుకున్నాడు? మరు నటి రోజు ఉదయం వరకు గాని తెలిసి రాలేదు, అప్పుడే అనుమానపడిన జనం మనస్సులు ఇప్పుడు కుదుటపడ్డాయి.

"రిక్షా వోనరు లంజాకొడుకుల్ని నమ్మితే ఇదే గతిరా!" అని గ్యాంగ్ కూలీల్లో ఒకడు తిడుతున్నాడు.

"ఎవర్ని ఎట్లా నమ్మితే ఏం లాభం? రోజూ వేలాదిమందిని మెల్లమెల్లగా, చిన్నచిన్నగా ఈ కల్తీసరుకులు చంపడం లేదా? రోజూ పెద్దోళ్లు చిన్నోళ్ళ కష్టాన్ని పిప్పిచేసి పండుగ చేసుకోడం లేదా? పేదోళ్ళ పేదరికాన్ని తొలగిస్తా మని పేదోళ్ళనే మింగేయడం లేదా? వెంకయ్యను ఇంకో రామయ్యో, రంగయ్యో చంపితే ఎవరిదా తప్పు?" అని అందరి ముందు సిగ్నల్ చూపే జెండా పట్టుకుని ఊపుతూ అరిచాడు ముసలి ముకద్దమ్- గ్యాంగ్ కూలీల మేస్త్రీ.

నిన్న రెండు వందల రూపాయలు చీటీ పాడి డబ్బు తీసుకొన్న వెంకయ్య ఏం కలలు కన్నాడని? పాపం బక్కోడు మంచోడు. ఏం కలలు కనగలడు? ఊరికెళ్లి ఒక మంచి పిల్లను చూసి పెళ్ళాడి కొంచెం సుఖం అనుభవించాలనుకొన్న వెంకయ్య కలలు ఆ రాత్రికే చీకట్లో ముక్కలై పోయాయి.

వెంకయ్య చాలా రోజుల్నుంచి కూడబెట్టిన డబ్బుల్ని రిక్షా వోనరు రంగయ్య నాయుడి దగ్గర దాచిపెట్టాడు. తనకు అవసరమైనపుడు తీసుకొంటానన్నాడు.

రిక్షాలనాయుడు రిక్షాలు తొక్కేవాళ్ళ పేర్లమీద అప్పులు పుచ్చుకొని మరికొన్ని బండ్లను పెంచాడు. వెంకయ్యలాంటి వాళ్ళ డబ్బు వాడుకొని జల్సా చేసాడు.

మొన్నగాక మొన్న తాను ఊరు వెళ్ళి పెళ్ళిచేసుకోవాలని కూడబెట్టిన డబ్బు ఇమ్మని వెంకయ్య నిలదీసాడు.

రంగయ్య రేపు మాపు ఇస్తానని వాయిదాలు వేసాడు.

చివరికి ఒకరోజు నాయుడి మనుష్యులు వెంకయ్యతోబాటు తాగారు.... చిత్తుగా తన్నారు.

డొక్కలని మాత్రమే సున్నం చేస్తామన్న వాళ్ళ ఉద్దేశం అయువుపట్టు లోనికివెళ్ళి తాకింది.

ఆ దెబ్బకు వెంకయ్య ప్రాణం వదిలాడు.

ఆ మనుషుల యజమాని రంగయ్య తెలివిగా ఆలోచన సప్లైచేసాడు. అంతే తెల్లారేసరికి చెట్టుపై శవం వేలాడింది.

మరునటి రోజు ఎట్లాగో ఒకడు, ఆ తరువాత మరొకడు దొరికిపోయారు. సాక్షిధారాలు లేవని ఆ తర్వాత విడుదలై పోయారు.

రంగయ్యనాయుడు మాత్రం రిక్షా వాళ్ళ చెమటవాసన వేసే డబ్బును పోలీసు జేబుల్లో కుక్కాడు. తను మాత్రం హాయిగా తప్పించుకున్నాడు.

భయంకరమైన మామూలు దృశ్యం ఇప్పుడక్కడ లేదు. చెట్టు ఆ శవం మోతకు కూలలేదు. బాధకు, ఏడ్పుకు దాని ఆకులు ఎక్కడా రాలలేదు.

చెట్ల మధ్య చల్లని గాలికి పడక కుర్చీలో ఊగేవాళ్ల నిద్రపోతూనే వున్నారు.

ఇంటి బయట తెల్లని బొచ్చుకుక్క, పిల్లల్ని షికారుగా తిప్పుతూనే ఉన్నారు.

ఆ చెట్టు ఈనాడు దేశమంత పెద్దది. కాని నీడ కొందరంటే కొందరిదే. పండ్లు, ఆకులు, బలవంతులవి మాత్రమే.

వెంకయ్యలు శవాలుగా వేలాడినప్పుడల్లా ఎండిన కొమ్మలు మాత్రమే దక్కుతున్నాయి.

---